

# వెదురు వంతెన

## అనువాద కథా సంకలనం

కొల్లూరి సోమ శంకర్

వెదురు వంతెన

© కొల్లూరి సోమ శంకర్

కాపీరైట్ హక్కులు:

మూలకథలకు: ఆయా రచయితలు

తెలుగు అనువాదానికి: కొల్లూరి సోమ శంకర్

ప్రథమ ప్రచురణ: జూలై 2013

# ముందుగా.....

- ఈ కథలను తెలుగులో అనువదించడానికి అనుమతించిన మూల రచయిత/రచయిత్రులకు
- ఈ కథలను ప్రచురించిన వివిధ పత్రికలకు, వాటి యాజమాన్యాలకు
- ముందుమాట రాసి నా అనువాద కథలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేసిన సుప్రసిద్ధ రచయిత, అనువాదకులు శ్రీ రంగనాథ రామచంద్ర రావు గారికీ, నా కథలపై తన అభిప్రాయాలను వెల్లడించి ఈ ఈ-బుక్ రూపొందించేందుకు ప్రోత్సహించిన మిత్రుడు చావా కిరణ్ కుమార్‌కీ,
- సాహితీ మిత్రులకు, కుటుంబ సభ్యులకు
- నా కథలను చదివి ప్రోత్సహిస్తున్న పాఠకులకు

## కృతజ్ఞతలు

టైపింగ్ నేనే చేసుకున్నాను కాబట్టి అక్షర దోషాలకు నాదే బాధ్యత. వీలైనంతవరకు తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాను. అయినా, ఎక్కడైనా అక్షరదోషాలు కనిపిస్తే, క్షమించి ముందుకు సాగండి.

ఈ పుస్తకంలోని కథలపై మీ అభిప్రాయాలను తెలియజేస్తారని ఆశిస్తూ...

**కొల్లూరి సోమ శంకర్**

somasankar@gmail.com

# ఈ కథల్లోకి వెళ్ళే ముందు...

ఈ అనువాద కథా సంకలనం రూపకర్త కొల్లూరి సోమ శంకర్ కథకుడిగా, అనువాదకుడిగా తెలుగు పాఠకలోకానికి సుపరిచితుడు. ఆ కారణంగా నిజానికి ఇతడి కథలను పరిచయం చేయాల్సి అవసరం కానీ, ముందు మాట ఆవశ్యకత కానీ అక్కర్లేదు. అయినా ఈ నాలుగు మాటలు రాయడానికి కారణం ఒకటి అనువాదాల పట్ల నాకున్న అభిమానం, రెండవది సోమ శంకర్ గారి పట్ల నాకున్న ఆత్మీయత.

ఈ సంకలనంలో ఆంగ్లం, ఉర్దూ, హిందీ, మణిపురి, మళయాళం భాషల నుంచి ఎన్నుకున్న కథలను అనువదించి తెలుగు పాఠకలోకానికి అందిస్తున్నారు సోమ శంకర్. అందుకు మనం ఆయన్ను అభినందించాలి. ఎందుకంటే అందరికి అన్ని భాషలు రావు. అభిలాష ఉన్నా ఇతర భాషా సాహిత్యాలను ఆ భాష రాకపోతే చదవలేం. ఇతర భాషల సాహిత్యంతో పరిచయం ఏర్పడటానికి అనువాదాలు ఒక వంతెనను నిర్మిస్తాయి. అనువాదకుడు వంతెనలా, లేదా మనకు మరో భాషకు మధ్య సంధానకర్తలా నిలబడి మరో భాషా సాహిత్యంలోకి మనల్ని అవలీలగా తీసుకెళ్ళి అక్కడంతా తిప్పుతాడు. అక్కడి లోకాన్ని చూపుతాడు. ఆ ప్రాంతాల్ని, అక్కడి వాతావరణాన్ని, అక్కడి వ్యక్తుల్ని, వారి జీవితాల్ని, వారి సంస్కృతుల్ని, అలవాట్లను, బాధల్ని, సంతోషాల్ని అన్నిటిని మనకు తెలియజేస్తాడు. ఆ ప్రాంతం మనకు పరిచయం అవుతుంది, ఆ ప్రజలు మనకు పరిచయం అవుతారు. వారి బాధలు, సంతోషాలు మనవి అవుతాయి. ప్రపంచంలో

ఎవరు ఎక్కడున్నా మనమందరం ఒకటే అనే భావన కలుగుతుంది. ఇందుకు అనువాదకుడు కారకుడు అవుతాడు.

సోమ శంకర్‌గారు అనువదించిన ఈ కథల లోతుల్లోకి నేను వెళ్ళదలుచుకోలేదు. అయితే ఆయన ఎన్నుకున్న కథలు ఎంతో వైవిధ్యంతో కూడుకున్నవని చెప్పగలను. ఈ కథలు చదివిస్తాయి. ఆలోచింపజేస్తాయి. వెంటాడుతాయి. కోపాన్ని తెప్పిస్తాయి. కంటతడి పెట్టిస్తాయి. కొన్ని కథలు నివ్వెరపోయేలా చేస్తాయి. పుస్తకం తెరిచి ఈ అనువాద కథలను మీరు చదవటం ప్రారంభించిన వెంటనే అందులో మీరు లీనమవుతారు. అందుకు కారణం ఆయన ఎన్నుకున్న కథలు, అందుకు ఆయన అనుసరించిన శైలి.

ఇక అనువాదాల విషయానికి వస్తే ఈ అనువాదాలన్నీ సరళంగా, సాఫీగా, క్లుప్తంగా, సొంత కథల్లా తెలుగుతనంతో కూడుకుని పాఠకుడిని వెంటనే ఆకట్టుకుంటాయనటంలో సందేహం లేదు.

ఈ సంకలనంలోని ప్రతీ కథా ఏదో ఒక ప్రత్యేకత కలిగినటువంటిది. వైవిధ్యభరితమైన ఈ కథల్ని చదవటం ఒక అనుభవం. చదివిన వెంటనే మొదట్లో సాధారణంగా ప్రారంభమైన కథలు చివరికి వచ్చేసరికి తల దిమ్మతిరిగేలా చేస్తాయి.

ఈ కథల్లో మీరు అనేక రకాల వ్యక్తుల్ని, మనస్సుల్ని, వ్యవస్థల్ని చూస్తారు. తను ప్రేమగా పెంచుకున్న చెట్టునే నరక వలసి వచ్చిన వాచ్‌మెన్, జీవితాంతం కుటుంబంకోసం పాటుపడిన వ్యక్తి వృద్ధాప్యంలో భార్య చనిపోయాక మారిన తన పరిస్థితుల వల్ల తీసుకున్న కఠిన నిర్ణయం, రెక్కలు వచ్చిన పిల్లలు తల్లితండ్రులను వొదిలేస్తే బిక్షమెత్తుకుని జీవించడనికి 'నా వల్ల

కాలేదు' అని వాపోయే వృద్ధ తండ్రి, తీరని అప్పు తీర్చడం కోసం కూతురుని తాకట్టు పెట్టిన పేదరికం.... అప్పు తీర్చిన తరువాతైనా తనను తీసుకెళ్ళమని అభ్యర్థించే కూతురు, ఇన్‌ఫార్మర్‌లు అనే అనుమానంతో పండు ముసలివాళ్ళను సైతం వదలని వ్యవస్థ, అవయవ దానంతో మానవత్వం ఇంకా చావలేదని చెప్పే మనిషి ... ఇలా ఈ సంకలనం గుండెల్ని తడుతుంది. హృదయాన్ని పిండుతుంది.

ఈ కథల గురించి ఎక్కువగా చెప్పటం నాకు ఇష్టం లేదు. ఎవరికి వారు చదివి అనుభూతి చెందవలసిందే.

అయితే ఒక్క మాట చెప్పాల్సి ఉంది – సోమ శంకర్‌గారు ఇలాంటి చక్కటి అనువాద సంకలనాన్ని తేవటం ద్వారా తమ లక్ష్యంలో సఫలీకృతులయ్యారనే చెప్పాలి.

వారికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తూ-

- **రంగనాథ రామచంద్రరావు**

రచయిత, అనువాదకుడు

# ఇందులో....


| | |
|---|---|
| నిలువనీడ | 1 |
| నీవు నేర్పిన విద్యయే | 7 |
| అంతరం | 17 |
| వెదురు వంతెన | 26 |
| నా వల్ల కాలేదు | 34 |
| సంకెళ్ళలో స్వప్నాలు | 44 |
| ప్రోగ్రెస్ కార్డు | 55 |
| నిషేధం | 64 |
| ఆటకట్టు | 69 |
| అమ్మా, వస్తావు కదూ.... | 75 |
| రాయి చరిత్ర | 81 |
| ఇన్‌ఫార్మర్ | 89 |
| ప్రత్యేకపాత్రలో నూతన నటి | 100 |
| ఆశ ఉందిగా... | 107 |

# నిలువనీడ

వాచ్‌మాన్ తెల్లవారు జామునే నిద్ర లేచాడు. వేకువ రాక ముందే జాగరూకుడై దానికి స్వాగతం పలకాలతను. ఒళ్ళు విరుచుకుని, తను కాపలాగా ఉండే భవనం చుట్టూ మూడు చుట్లు చుట్టడంతో తన దినచర్యని ప్రారంభించాడు. మొదట దగ్గరలో ఉన్న పబ్లిక్ టాయ్‌లెట్‌లోకి దూరాడు. తర్వాత ఓ మగ్గులో నీళ్ళు, కాస్త పళ్ళపొడి తీసుకుని చూపుడువేలితో పళ్ళు తోముకున్నాడు. తోటలో చిల్లులు పడ్డ నీటి గొట్టంతో చన్నీళ్ళ స్నానం కానిచ్చాడు.

సూర్యుడు, పేదవాళ్ళు, సాంప్రదాయవాదులు నిద్ర లేచేటప్పటికల్లా బేస్‌మెంట్‌లో ఉన్న తన చిన్న గదికి స్నానం చేసి వచ్చేసాడు. ఒళ్ళు తుడుచుకుని, తనకున్న రెండో జత యూనిఫాం వేస్కున్నాడు. టీ నీళ్ళు మరగపెడుతూ, తన గది చుట్టూ చూస్కున్నాడు. మాసిన మరో జత యూనిఫాం, ఒక జత మాములు బట్టలు, కొన్ని లోదుస్తులు, ఓ అద్దం, ఓ దువ్వెన, ఓ పాడై పోయిన చేతి గడియారం, వాడని రెండు షేవింగ్ బ్లేడ్లు, కులదైవం ఫోటో, వీటన్నింటితో ఏ మాత్రం పొందిక లేని ఓ మాంట్ బ్లాంక్ పెన్ను. అది కారణాంతరాల వల్ల ఇల్లు అమ్ముకుని వెళ్ళిపోతున్న అప్పటి యజమాని తన దగ్గర చాలా కాలం నుంచి పని చేస్తున్న వాచ్‌మాన్ ఉద్యోగం తీసేస్తూ ఇచ్చిన బహుమతి. ఆ రోజుల్లో ఎంతో బాగుండేది. తన కోసమే ఓ అవుట్ హౌస్ ఉండేది, తోటలో ఓ మూల కొంత స్థలం ఉండేది. అక్కడ అతను కొన్ని గులాబి మొక్కలు తెచ్చి నాటాడు, పూలు రానేలేదు. కొన్ని

బంగాళాదుంపలు పాతాడు కాని దుంపలు పూర్తిగా పక్వానికి రాక ముందే హడావుడిగా తవ్వి తీసేసాడు. పాపం, యజమాని ఈ చేష్టలన్నింటిని భరించాడు. హాయిగా జీవితం చివరిదాకా అలానే ప్రశాంతంగా గడిచిపోవాల్సింది. ఖర్మ! ఇక్కడకొచ్చిపడ్డాడు.

టీ కొద్దికొద్దిగా చప్పరిస్తూ, భవనం మేలుకోడం విన్నాడు. బిల్డింగ్ సెక్రటరీకి నచ్చచెప్పదలచుకున్న మాటలను మళ్ళీ మననం చేసుకున్నాడు. ఈ అభ్యాసం బానే సాగింది ఎందుకంటే అతను ప్రస్తుతం నచ్చచెప్తుంది తన కులదైవం ఫోటోకి. ఈ మూగ దైవం ఆ మహా కోపిష్టి మనిషికి ప్రత్యామ్నాయం కాదు మరి!

“నువ్వెందుకూ పనికి రావు...” అని కులదైవాన్నుద్దేశించి అంటూ నీరెండలో కూర్చోడానికి బయటకు నడిచాడు. మెల్లిగా పొద్దెక్కుతోంది. సందు మలుపులో గారేజ్ ఉన్న మెకానిక్ వెడుతూ వెడుతూ పలకరించి వెళ్ళాడు. వీధి చివర ఉన్న గుడిలో పూజారి ఇతన్ని అసలే మాత్రం పట్టించుకోకుండానే వెళ్ళిపోయాడు.

ఇంతలో ఏడో నెంబరు అపార్ట్‌మెంట్‌కి ఎవరో ఒకాయన ఆటోలో రైలు ప్రయాణంలో వుండే నిద్రలేమి, అలసటతో పాటు పెద్ద పెద్ద సామాన్లు కూడా మోసుకొచ్చాడు. వాచ్‌మన్ వాటిని తన బాధ్యతగా ఆటోనుంచి ఊగిపోతూ వుండే పాత లిఫ్ట్ వరకు మోసుకెళ్ళాడు. రోడ్డు కెదురుగా ఫుట్‌పాత్ పైన పూలమ్ముకునే లావుపాటి ఆవిడ వచ్చి తన సరంజామా పరిచింది. మొగ్గలపై నీళ్ళు చల్లింది, నిండుగా విచ్చుకున్న పూలతో మాల అల్లడం మొదలు పెట్టింది. మల్లెపూల వాసన పట్టణపు ముక్కి వాసనను కాసేపు భరించేలా చేసింది.

ఇక పోక మొదలైంది. మూడో నెంబరు అపార్ట్‌మెంట్‌లో ఉండే సేల్స్ ఎగ్జిక్యూటివ్ గబగబా మెట్లు దిగాడు. కిక్ కొట్టి బైకుని స్టార్ట్ చేసి హడావుడిగా ముందుకు దూకించాడు. ఆరో నెంబరు అపార్ట్‌మెంట్‌లో ఉండే సొగసరి ఇంజనీరింగ్ విద్యార్థిని హొయలుపోతూ మెట్లు దిగి, తన కోసం రోడ్డు మీది కాసుకుని కూర్చున్న రోమియోని పట్టించుకోకుండా బస్‌స్టాండ్ వైపు నడిచింది. తొమ్మిదో నెంబరు అపార్ట్‌మెంట్‌లో ఉండే కవలలు ఏడుస్తూ కిందకొచ్చారు, వాచ్‌మాన్ వేళ్ళు పట్టుకుని కూడా ఏడుస్తునే ఉన్నారు. స్కూల్ బస్ రాగానే, బాల్కనీలోంచి వాళ్ళమ్మ చూస్తున్నా సరే, ఏ మాత్రం ఉత్సాహం లేకుండా బస్ ఎక్కారు. పిల్లలు జాగ్రత్తగా బస్ ఎక్కడాన్ని చూసి వాళ్ళమ్మ తలూపింది.

వీళ్ళంతా సరే, అతని పాలిట యమగండం - బిల్డింగ్ సెక్రటరీ మాటేమిటి? "ఇంకా నిద్ర లేచుండడు దుంప ముఖం వెధవ. వీడూ అందరిలా పోతే బాగుండు" అని అనుకున్నాడు ఆలోచనగా.

ఎప్పటికో చాలా సేపటికి, సెక్రటరీ మెట్లు దిగి తన కొత్త కారు కేసి దర్జాగా నడవడం చూసాడు. ఉన్నట్లుండి తన వాదనలో పస లేదని వాచ్‌మాన్‌కి అనిపించింది. ఒక్క క్షణం పాటు ఆలోచించాడు. తన వాదనని మరోసారి వినిపించాలా లేక, పని మానేస్తానని నిన్న మూర్ఖంగా బెదిరించినందుకు క్షమించమని బ్రతిమాలాలా? అతడు ఈ రెండూ చేయలేదు. బదులుగా, గేటు మీదుగా దారికి అడ్డంగా వంగిపోయిన చెట్టు కొమ్మని ఎత్తి పట్టుకున్నాడు. దాంతో సెక్రటరీ తన కారుని జాగ్రత్తగా బయటకు తెచ్చాడు.

కిటికి కొంచెం తెరిచి, కార్లోంచి వస్తున్న చక్కని పరిమళం వాచ్‌మన్‌ని కాసేపు పీల్చుకోనిచ్చాడు.

"ఏదో ఒకటి తేల్చుకో! నేను సాయంత్రం తిరిగొచ్చేసరికి ఉంటే నువ్వు లేకపోతే ఆ చెట్టు" అంటూ వెళ్ళిపోయాడు సెక్రటరీ.

ఉక్కపోతతో కూడిన ఆ మధ్యాహ్నం వేళ వీచిన చిరుగాలికి వాచ్‌మాన్‌కి కునుకు పట్టేసింది. ఊహాలోకాల్లోకి జారుకున్నాడు. అక్కడ సెక్రటరీ ఓ పేడపురుగుగా మారిపోయాడు. చెప్పులు లేని తన కాలితో ఆ పురుగుని నలిపేస్తున్నాడు, దాని మూగ రోదనలను పట్టించుకోకుండా. అంతే! ఉన్నట్లుండి ఓ తుమ్మెద రొద చేస్తూ చుట్టూ తిరగడంతో అతనికి మెలకువ వచ్చేసింది. బైటప్రపంచంలోకి వచ్చాడు.

సెక్రటరీ పేడ పురుగు కాలేదు. అతను తన రాకపోకలకి ఆటంకం కలిగిస్తున్న ఆ చెట్టుని కొట్టించేయాలనే లక్ష్యంతో ఉన్నాడు. వాచ్‌మాన్ నిట్టూర్చాడు. మూడేళ్ళ క్రితమే కదా? - తన సొంత చేతులతో గేటు పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో ఓ మొక్కని నాటాడు. అదే ఇప్పుడీ అద్భుతమైన, చురుకైన చెట్టుగా ఎదిగింది, కొద్దిపాటి గాలికే ఆకులను గలగలలాడిస్తూ, ఆవరణలోకి వచ్చిపోయే కార్లకు స్వాగతం పలుకుతుంది. బయట ప్రపంచపు వరండాలో నిలబడి, లోపలి ప్రపంచమంతా భిన్నమైనదని గర్వంగా చెబుతున్నట్లుంటుంది.

చెట్టు చిన్నగా గలగల్లాడింది. చిరపరిచితమైన ఆ సవ్వడి ఒక్కసారిగా అతడిని శాంతపరచింది, అదే క్షణంలో విచారమూ కలిగించింది. అన్నీ తెలిసిన ఆ దేవుడు ఈ చెట్టుని గేటు మీదగా వాలమని ఎందుకన్నాడు? గేటుకు

దూరంగా ఉండుంటే ఆ సెక్రటరీ కొత్తకారు ఏ ఆటంకం లేకుండా బయటకు వెళ్ళగలిగేది కదా?

సెక్రటరీని తలచుకోగానే వాచ్‌మాన్‌కి కోపం వచ్చింది. "వాడి మొహం మండ" అని తిట్టుకున్నాడు. "నువ్వు నా చెట్టువు. నాతోనే నువ్వు కూడా" అంటూ చెట్టుకి ధైర్యం చెప్పాడు.

"నిజమా?" అడిగింది చెట్టు ఓ సంతోషమైన స్నేహితుడిలా, కొమ్మలను ఊపుతూ.

"కాదు. నిజం కాదు".

కొన్నాళ్ళ క్రితం తన మేనకోడలిని చూడడానికి పట్టణంలోకి వెళ్ళిన సంగతి గుర్తు చేసుకున్నాడు. రోడ్లన్నీ బస్సులతో, బస్సులన్నీ జనాలతో నిండి ఉన్నాయి. వాళ్ళంతా ఎక్కడికెడుతున్నారు? ఏం పనులు చేస్తారు? అతన్ని విపరీతమైన భయం ఆవహించింది. ఆ రోజు నుంచి మెయిన్ రోడ్ దాటాలంటేనే గజగజా వణికిపోతున్నాడు. మరి కొత్త ఉద్యోగాన్ని వెదుక్కోడం, కొత్త జీవితాన్ని ఆశించడం జరిగే పనేనా? కాదు. ఏ మాత్రం కాదు.

"ఎందుకు.." చెట్టు అలిగింది.

"నువ్వు నన్ను అర్థం చేసుకోవాలి" అన్నాడు వాచ్‌మాన్ కీచుగొంతుతో. "ఎవడైనా దొంగ దూరితే, నాకు గట్టిగా అరిచే బలం కూడా లేదు. నా పక్కటెముకల్ని లెక్కపెట్టడం ఆ కవలపిల్లలకి ఒక ఆట. ఇదీ నా బతుకు!"

"బావుంది. సరే అయితే..." చిన్నగా కదిలింది చెట్టు.

ఒకరి సహచర్యాన్ని మరొకరు ఆస్వాదిస్తూ చెట్టు, అతను అలాగే కూర్చుండిపోయారు. సూర్యుడు పొద్దు గూకుతున్నాడు. ఉన్నట్లుండి

జ్ఞానోదయమైనట్లు హఠాత్తుగా లేచి గబగబా తన గదికి పరిగెత్తి మాంట్ బ్లాంక్ పెన్నుతోనూ, బ్లేడ్ తోనూ తిరిగి వచ్చాడు. బ్లేడ్‌తో చెట్టు మొదల్లో అరచేయంత వెడల్పుగా బెరడు కోసి తీసేసాడు. నున్నగా ఉన్న కాండంపై పెన్నుతో తన పేరు ఎంతో ప్రేమగా రాసుకున్నాడు. దాన్ని చూసుకుంటూ కాసేపు అక్కడే తృప్తిగా కూర్చున్నాడు లేచెళ్ళి గొడ్డలి తేబోయే ముందు.

[ఆంగ్ల మూలం: ఈశ్వర్ సుందరేశన్]

(ఈమాట వెబ్ జైన్, జులై 2010 సంచికలో ప్రచురితం)

# నీవు నేర్పిన విద్యయే

కాలనీలోని పార్కులో కూర్చున్న మదన్‌లాల్ ఆలోచనల్లో కూరుకుపోయాడు. తన వద్ద ఏమీ లేనట్టు, తన అవసరం ఎవరికీ లేనట్టు అతనికి అనిపిస్తోంది. అతని మిత్రులు ఇప్పటిదాకా కబుర్లు చెప్పి, ఇప్పుడే వెళ్ళిపోయారు. కానీ ఆయన కాళ్ళు ఈ రోజాయన మాట వినడం లేదు. కూర్చున్న చోటునుంచి లేవాలనుకోడం లేదు. సంధ్యా చీకట్లు ముసురుకుంటుంటే అతని ముందు గడచిన 30 సంవత్సరాల జీవితం సినిమా రీలులా గిర్రున తిరిగింది.

* * *

బ్యాంక్ ఉద్యోగం, గుణవతైన భార్య కాపురానికి రావడం.. అప్పుడే బ్యాంక్ లోన్ తీసుకుని సొంతిల్లు కట్టుకోవడం. కొత్త ఇంట్లోనే పెద్ద అబ్బాయి జననం. మిఠాయిలు పంచడంలో అతనెన్నడూ అలసిపోయేవాడు కాదు. తండ్రి అయిన ఆనందం... అందునా పుట్టింది కొడుకంటే... మరీ ఆనందం, సమాజంలో విలువ పెంచే విషయం కదూ. గర్వంతో మదన్‌లాల్ ఛాతి పొంగిపోయేది. రెండేళ్ళు గడిచాయో లేదో, ఇంకో కొడుకు పుట్టాడు. మదన్‌లాల్ దంపతుల సంతోషానికి పట్టపగ్గాలు లేవు. పిల్లల బారసాల ఘనంగా చేసాడు, పెళ్ళి స్థాయిలో ఖర్చు పెట్టాడు. సునీల్, అనీల్ కాలంతో పాటు పెరిగి పెద్దయ్యారు. సునీల్ ఇంజనీర్ అయ్యాడు, అనీల్‌కి మాత్రం పెద్దగా చదువబ్బలేదు. ఎలాగోలా డిగ్రీ అయిందనిపించాడు. సునీల్‌కి ఓ గొప్ప పేరున్న కంపెనీలో ఉద్యోగం దొరికింది, హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఆ తర్వాత